క్లుప్తంగా

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

నంద్యాల(సెంట్రల్): జిల్లా కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. సీఐ సునీల్‌కుమార్ బృందం వ్యవసాయాధికారులతో కలిసి నూనెపల్లెలోని పలు దుకాణాల్లో నిల్వ వివరాలు, బిల్లు పుస్తకాలు, ఉత్పత్తుల్ని పరిశీలించారు. లక్ష్మీ వెంకటేశ్వర షాపులో రూ.16,500 విలువజేసే 7 సీసాల పురుగుమందుకు సరైన పద్దు లేకపోవటంతో అమ్మకాలు నిలుపుదల చేశారు. విజిలెన్స్ అధికారులు సిద్దయ్య, నంద్యాల వ్యవసాయాధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి


సుభాన్ (ఫైల్)

ఉయ్యాలవాడ : స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న దూదేకుల సుభాన్(32) అనారోగ్యంతో మృతి చెందినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ దొర్నిపాడుకు చెందిన దూదేకుల సుభాన్ 2013లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. ఉయ్యాలవాడ పోలీస్ స్టేషన్‌లో 2020 జూన్ నెలలో బాధ్యతల్లో చేరారు. చాగలమర్రి, కోవెలకుంట్ల పోలీస్ స్టేషన్‌లలో పనిచేశారు. పచ్చకామెర్లు సోకడంతో ఈ నెల 5న కర్నూలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం సాయంత్రం మృతి చెందారు. మృతుడికి భార్య విజయకుమారి, ఇద్దరు కుమారులున్నారు. ఆయన మృతి పట్ల ఎస్ఐ, సిబ్బంది సానుభూతి తెలిపారు.

వేతనాలు చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు జూన్ నెల వేతనం తక్షణమే చెల్లించాలని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి నగరి శ్రీనివాసులు కోరారు. శనివారం స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల క్యాడర్ స్ట్రెంత్ వివరాలను డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ సీఎఫ్ఎంఎస్ కార్యాలయాలకు వెంటనే పంపించి త్వరగా చెల్లించేలా ఏర్పాటు చేయాలన్నారు. నంద్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, సాంబశివుడు పుల్లయ్య, రవి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

ఆళ్లగడ్డ: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ సూచించారు . హౌసింగ్ డే సందర్భంగా శనివారం మండలంలోని ఎస్.లింగందిన్నె గ్రామ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు, వసతులను పరిశీలించారు. అనంతరం స్థానిక గ్రామ సచివాలయంలో అధికారులు, లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు.

గర్భిణులకు టీకాలు తప్పనిసరి

నంద్యాల(రూరల్): సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని ప్రతి గర్భిణికి, 5 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. శనివారం మండలంలోని చాబోలు గ్రామ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి డాక్టర్ వైఎస్సార్ పోషణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లెల్ల పీహెచ్‌సీ వైద్యులు జగదీశ్‌చంద్రారెడ్డి ఉన్నారు.

వర్షాభావ పరిస్థితులపై సమావేశం

నంద్యాల(సెంట్రల్): ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులు పొంచివున్న నేపథ్యంలో పంటల సరళి, వాతావరణం, వర్షపాతంపై శనివారం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శిక్షణ సందర్శన సమావేశం జరిగింది. సహ సంచాలకులు, నంద్యాల, కర్నూలు జిల్లాల వ్యవసాయాధికారులు మోహన్ రావు, వరలక్ష్మి మాట్లాడారు. ఎర్ర నేలల్లో ఈ నెలాఖరు వరకు, నల్లరేగడి నేలల్లో ఆగస్టు చివరి వరకు పంటలు సాగు చేసుకోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. శాస్త్రవేత్తలు మంజునాథ్ డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీ, ఆలూరు మండలంలో అడవి జంతువుల నుంచి పంటలు రక్షించుకునే పద్ధతులపై అవగాహన కల్పించారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి

నంద్యాల(అర్బన్): శ్రీశైలం మండలంలోని సున్నిపెంట గ్రామ పంచాయతీ పరిధిలో అనుమతిల లేకుండా చేపడతున్న లాడ్జీలు, హోటళ్లు, ఇళ్ల నిర్మాణాలు, కుళాయిల ఏర్పాటును అడ్డుకోవాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారిణి మంజులవాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశాల మేరుకు ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం ఇరిగేషన్ శాఖ వద్ద ఉన్న 208.74 ఎకరాలు గ్రామ పంచాయతీకి బదలాయించినట్లు తెలిపారు. ఇందు కోసం పంచాయతీలో జరుగుతున్న ఏ కట్టడానికైనా అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం కాకుండా కట్టడాలు చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

నంద్యాల(న్యూటౌన్): పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం కోరారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో అబ్బాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన అన్ని మండల కేంద్రాల్లో, ఆగస్టు 4న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

జగనన్న సురక్షతో అర్హులకు పథకాలు


నెహ్రూనగర్‌లో ధ్రువ పత్రాలను అందజేస్తున్న పీపీ నాగిరెడ్డి, అధికారులు,


బోదెమ్మనూరులో ధ్రువ పత్రాలు అందజేస్తున్న డీఎల్‌డీఓ, ఎంపీపీ

గోస్పాడు: అర్హులై ఉండి వివిధ కారణాల వల్ల పథకాలు అందని వారికి సంక్షేమ పథకాలు అందజేయాలని ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి తెలిపారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు సచివాలయం ద్వారా అన్ని రకాల సేవలు అందిస్తున్నారన్నారు. గతంలో ప్రజలకు ఏ అవసరం వచ్చిన ఇతర ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. జగనన్న పాలనలో అలాంటి పరిస్థితి లేకుండా గ్రామంలో ప్రభుత్వ సేవలందేలా చర్యలు చేపట్టారని, ప్రజలకు ఇబ్బందులు తప్పించారని కొనియాడారు. గ్రామంలో 217 మంది దరఖాస్తు చేసుకున్నారని ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయశేఖర్, ఈఓఆర్‌డీ అనసూయ తెలిపారు. వీటిలో కుల ధ్రువీకరణ పత్రాలకు 105, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు 105 దరఖాస్తులు రాగా మరో 10 ఇతర పత్రాల కోసం దరఖాస్తు చేస్తుకున్నారన్నారు. వీటిని ఆయా శాఖల అధికారులు పరిశీలించి అక్కడికక్కడే మంజూరు చేశారు. ఎంపీపీ ఆర్థర్ సైమాన్, సర్పంచ్ శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : జగనన్న సురక్షతో సత్వర సేవలు అందుతున్నాయని ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అన్నారు. శనివారం మండలంలోని బోదెమ్మనూరు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ, గ్రామ సర్పంచ్‌లు బందెల సువర్ణ, మధుసూధనాదేవి, సింగిల్‌విండో అధ్యక్షుడు పోచా వెంకటరెడ్డి, డీఎల్‌డీఓ జనార్ధన్‌రావు పాల్గొని పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. గ్రామ వలంటీర్లు ఇంటింటా చేసిన సర్వేలో 105 మందికి టోకెన్లు జారీ చేయగా వారందరికీ ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు. తహసీల్దార్ రవికమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఏఓ రాజేంద్రకుమార్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీసువర్ణ, డిజిటల్ అసిస్టెంటు మౌలాలి పాల్గొన్నారు.

పథకాల అమలుకు ధ్రువపత్రాలే సురక్ష

దొర్నిపాడు: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలంటే అందుకు ధ్రువ పత్రాలే సురక్షగా ఉంటాయని ఎంపీపీ అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. గ్రామంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 410 మందికి ధ్రువపత్రాలు, కౌలుకార్డులను అందజేశారు. అలాగే సచివాలయ ఆవరణలో ఆధార్ నమోదు కేంద్రం, వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శకుంతల, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, సొసైటీ ప్రెసిడెంట్ భూమా చెంచిరెడ్డి, సర్పంచి బాలయ్య, నాయకులు జాకీర్‌బాషా, ఓర్వకంటి శాంతయ్య, వరప్రసాద్, రఫీ, డీలర్ పెద్దన్న, చిన్నమద్దిలేటి, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, తహసీల్దార్ జయప్రసాద్, ఆర్‌డబ్ల్యూ ఎస్ఏఈ సుప్రియ, ఏఓ సునీత, డాక్టర్లు భార్గవి, పావని, ఎంఈఓ రామచంద్రరావు, మండల రీసోర్స్ కో ఆర్డినేటర్ జర్మియా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ పాల్గొన్నారు.


ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ

శిరివెళ్ల: ప్రజల కోసమే ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహిస్తుందని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ అన్నారు. శనివారం గోవింద పల్లె -1 గ్రామ సచివాలయంలో సర్పంచు మరియమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 467 మందికి కుల, ఆదాయ, కౌలు రైతకు గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో జగనన్న సురక్ష మండల ఇన్‌చార్జ్ ఇందూరి ప్రతాపరెడ్డి, ఉప సర్పంచు శేషారెడ్డి, ఎంపీటీసీ స్వాతి,ఏఓ సుధాకర్ పాల్గొన్నారు.

214 ధ్రువ పత్రాల పంపిణీ

రుద్రవరం: మండలంలోని మందలూరులో శనివారం అధికారులు గ్రామ సర్పంచ్ నిర్మలమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దారు రవీంద్ర ప్రసాదు, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, పీఆర్ ఏఈ వెంకటరాముడు, మండల ఉపాధ్యక్షుడు శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి తదితరులు 214 మందికి ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ట చర్యలు


మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: వివిధ ప్రాంతాల నుంచి దిగుమతి అయ్యే గంజాయి, గుట్కా తదితర మత్తు పదార్థాలను నియంత్రించేందుకు పోలీసులతో పాటు రెవెన్యూ, వ్యవసాయ, ఉన్నత విద్యా, దేవాదాయ శాఖ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మత్తు పదార్థాల నియంత్రణ అమలుపై కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ పుల్లయ్య, అడిషనల్ ఎస్పీ జి.వెంకటరాముడు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, డోన్, నంద్యాల సబ్ డివిజనల్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్నీ పోలీసు స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి గంజాయి ఇతర మత్తు పదార్థాలపై దాడులు నిర్వహించి అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రుల్లో డి అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసి మత్తుకు బానిసైన వ్యక్తులలో మార్పులు తీసుకురావాలని డాక్టర్లను కోరారు.

వేతనాలు చెల్లించాలి

నంద్యాల: ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ సంస్థల్లో పనిచేస్తున్న సఫాయి కర్మచారులకు ప్రతినెలా వేతనాలు చెల్లించాలని ఎస్పీ రఘువీర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సఫాయి కర్మచారులు, మాన్యువల్ స్కావెంజర్ల కుటుంబాల పునరావాసంపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ పుల్లయ్య, అడిషనల్ ఎస్పీ జి.వెంకట రాముడు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, డోన్, నంద్యాల సబ్ డివిజనల్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈఎస్ఐ కార్డులను కూడా మంజూరు చేయాలన్నారు. కమిటీ దృష్టికి తీసుకొచ్చిన అంశాలను పరిష్కరించాలని డీఆర్‌ఓ పుల్లయ్యకు సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చింతామణి, సఫాయి కర్మ చారుల కమిటీ సభ్యులు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు

నంద్యాల(అర్బన్): బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు జరుగుతాయని, వాటిని ప్రోత్సహించే వారిపై చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీడీ నిర్మల స్పష్టం చేశారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో బాలల హక్కులు, సేఫ్ టచ్, అన్ సేఫ్ టచ్, ఫోక్సో యాక్టుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్న వయస్సులో బాలికలకు వివాహాలు చేస్తే కాన్పు సమయంలో ఇబ్బందులు పడటమే కాకుండా పిల్లలు తక్కువ బరువు, మానసిక లోపాలతో పుట్టడమే కాకుండా శిశు మరణాలు సంభవిస్తాయన్నారు. అపరిచిత వ్యక్తుల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జరిగిన సంఘటనలను తల్లిదండ్రులకు తెలపాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారిణి శారదా మాట్లాడుతూ సమాజంలో బాలల హక్కులకు ఉల్లంఘించే సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. వరల్డ్ విజన్ పీఓ తిరుపతి రావు, మదర్ సొసైటీ అధ్యక్షులు రామారావు, స్వర్ణలత, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

నంద్యాల(అర్బన్): సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, కార్మికులు పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి హెచ్చరించారు. శనివారం ఉదయం పట్టణంలోని నూనెపల్లె ఫ్లై ఓవర్ సమీపంలోని డ్రైనేజీ కాల్వలను పరిశీలించిన అనంతరం పట్టణ శివారులోని ఊడుమాల్పురం పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. చెత్త బండి సిబ్బందికి చెత్త అందజేసి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. ఎంహెచ్ఓ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

1 నుంచి సాంస్కృతిక పోటీలు

నంద్యాల(వ్యవసాయం): ఆగస్టు 1వ తేదీ నుంచి విద్యార్థులకు కళారాధన ఆధ్వర్యంలో సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కళారాధన అధ్యక్ష కార్యదర్శులు మధుసూదనరావు, డాక్టర్ రవికృష్ణ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఏటా నంద్యాల కళారాధన సాంస్కృతిక సంస్థ, నంద్యాల ఐఎంఏ, లయన్స్‌క్లబ్ సంయుక్త సహకారంతో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 1న ప్రారంభమై 15వ తేదీ వరకు జరుగుతాయని, 75 అంశాల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరీల్లో చిత్రపట విశ్లేషణ, లఘు చలన చిత్ర విశ్లేషణ, కవితా రచన, లేఖారచన, కవితాగానం, పద్యపఠనం, సంస్కృత శ్లోకాల పఠనం తదితరాలతో పాటు తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, చిత్రలేఖనం, క్విజ్, శాస్త్రీయ, జానపద, ఆధునిక నృత్య పోటీలు, ఆటల పోటీలు, లఘు నాటికలు నిర్వహించనున్నామని చెప్పారు. ఆగస్టు 15న సాయంత్రం బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. నిర్వాహకులు రవిప్రకాష్, శ్రీకాంత్, రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొనే వారు బాలాజీకాంప్లెక్స్‌లోని కళారాధన కార్యాలయంలో పేర్లు అక్కడే నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ : 9959307424, 6300715927 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

నంద్యాల(అర్బన్): ముఖ్యమంత్రి సహాయ నిధిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. గోస్పాడు మండలం ఎం.కృష్ణాపురం గ్రామానికి చెందిన నాగలక్ష్మమ్మ కుటుంబానికి శనివారం సాయంత్రం రూ.5.24 లక్షలు చెక్కును ఆయన నివాసంలో అందజేశారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు కోటిరెడ్డి ఉన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

తూములు దూకేంత కురిసింది..


క్రిష్టిపాడులో మిద్దెపై నుంచి తూముల ద్వారా దూకుతున్న వర్షపు నీరు

దొర్నిపాడు: ఓరన్నో మా ఊర్లో ఈ రోజు వాన కురిసందన్నో.. ఎంత కురిసిందేంటి..తూములు దూకేంతగా..అయితే మంచి వర్షమేగా అంటూ బదులిచ్చుకున్నారు. పల్లెలో నేటికీ వర్షంపై పూర్వపు లెక్కల ఆధారంగా మాట్లాడుకుంటున్నారు. మట్టిమిద్దె పై నుంచి వర్షపు నీరు తూముల ద్వారా దూకితే మోస్తరు వానగా గ్రామీణులు పరిగణిస్తారు. కాగా శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఇప్పటికే సాగు చేసిన మినుము, మొక్కజొన్న పంటలకు ఈ వర్షం ప్రాణం పోసినట్లయ్యిందని రైతులు చెబుతున్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి

దొర్నిపాడు: రైతులు ఖరీఫ్ సాగులో చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని సొసైటీ ప్రెసిడెంట్ భూమా చెంచిరెడ్డి సూచించారు. 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడంతో శనివారం స్థానిక రైతు భరోసా కేంద్రం-2లో రైతులకు కొర్రలను అందజేశారు. అనంతరం చిరుధాన్యాల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల వల్ల తక్కువ పెట్టుబడి అధిక ఆదాయం ఉంటుందని ఏఓ సునీత చెప్పారు.

ఆర్థిక సాయం

నంద్యాల(న్యూటౌన్):పట్టణంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ముస్లిం మైనార్టీ నాయకురాలు ఫాతిమా ఆర్థిక సాయం చేశారు. వైజయంతి అనే విద్యార్థినికి రూ.15వేలు అందజేశారని ప్రిన్సిపాల్ సోమశేఖరప్ప శనివారం తెలిపారు.

నేటి నుంచి గంగమ్మ జాతర

ఉయ్యాలవాడ : మండలంలోని ఇంజేడు, కొండుపల్లె గ్రామాల్లో గ్రామ దేవత గంగమ్మ జాతర ఆదివారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా జరగనుంది. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఐకమత్యంతో విరాళాలు సేకరించి ఆయా గ్రామాల్లో ఆలయాలను నూతనంగా నిర్మించారు. నెల క్రితం ఆలయాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించారు. 41 రోజుల వేడుకల్లో భాగంగా ఆలయ నిర్వాహకులు, రైతులు సమష్టిగా జాతరను నిర్వహిస్తున్నారు. ఈ నెల 18న అమ్మవారికి బోనాలు, పొంగుపాలు నైవేద్యంగా సమర్పిస్తారు.

మండల రీసోర్స్ కోఆర్డినేటర్‌గా రమణారెడ్డి

ఉయ్యాలవాడ : స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల రిసోర్స్ కో ఆర్డినేటర్‌గా కె.రమణారెడ్డిని నియమించినట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా కలెక్టర్ సృజన జారీ చేసిన నియామక ఉత్తర్వులు కార్యాలయానికి అందాయని చెప్పారు.

అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): మణిపూర్‌లో జరిగిన అల్లర్ల ఘటనపై నిజనిర్ధారణ కోసం వెళ్లిన జాతీయ మహిళా సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి అనిరాజ, దీక్షా త్రివేది, జాతీయ ఉపాధ్యక్షులు నిషాసిద్ధులపై బనాయించిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మీదేవి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నంద్యాలలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సరస్వతి, రాజ్యలక్ష్మి, పెద్దక్క, సుబాషిని, త్రివేణి, రాణెమ్మ, మహేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

రుద్రవరం: మండలంలోని ముత్తలూరు మెట్ట సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయ పడ్డాడు. నర్సాపురం గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి అనే వ్యక్తి ఆళ్లగడ్డ నుంచి స్వగ్రామానికి మోటార్ సైకిల్‌పై వస్తుండగా ఆళ్లగడ్డకు చెందిన ఓ ప్రైవేటు బస్సు విద్యార్థులను దింపి తిరిగి వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ప్రమాదంలో బాల్‌రెడ్డి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే నర్సాపురం గ్రామస్తులు క్షతగాత్రుడిని అదే ప్రైవేటు బస్సులో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడి వైద్యులు ప్రథమ చికిత్సలు చేసి నంద్యాలకు రెఫర్ చేయగా నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

'స్పందన' నిర్వహించండి

నంద్యాల(రూరల్): ప్రతి సోమవారం మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీఓ సుగుణశ్రీ శనివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ స్పందనకు వచ్చే వినతులను స్వీకరించి రశీదు ఇచ్చి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. అర్జీ దారులు పై అధికారులకు ఫిర్యాదు చేస్తే సంబంధిత సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

శాకాంబరిగా గాయత్రీ దేవి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ప్రథమనందిలో వెలసిన శ్రీగాయత్రీ దేవాలయంలో శనివారం బ్రహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు. సమాఖ్య అధ్యక్షుడు మురళీకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి నగరడోన సుధీర్ మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలనే సంకల్పంతో ఆషాడ మాసంలో వివిధ రకాల కూరగాయలతో, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించామని చెప్పారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి

నంద్యాల(సెంట్రల్): శ్రీశైలం కుడి కాలువ ఆయకట్టుకు ఆయువుపట్టు లాంటి గోరుకల్లు జలాశయం పరిస్థితిపై రైతాంగం ఆందోళనలో ఉందని రాయలసీమ సాగునీటి సాధన సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. కుంగిన మట్టికట్టలకు సంబంధించి మరమ్మతులు వెంటనే చేపట్టాలని కోరుతూ ఎస్సార్‌బీసీ ఉప పర్యవేక్షకులు రాజేంద్రప్రసాద్‌ను శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ బలహీనమైన కట్టలతో ప్రాజెక్టు మనుగడకు ముప్పు పొంచి ఉందని గతంలో ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేశారు. అలగనూరు జలాశయం మట్టికట్ట కుంగటంతో నేటికీ సాగు,తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే గోరుకల్లు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఉపాధ్యక్షులు వైఎస్‌రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులు భాస్కర్‌రెడ్డి, రాముడు, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఆపద సమయంలో ఆదుకున్నాడు


నంద్యాలలో బంధువుల ఇంట్లోనున్న ఆకుల లక్ష్మమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మహమ్మద్ రఫీ

ఇక్కడి పింఛన్ తీసుకుంటున్న వృద్ధురాలి పేరు ఆకుల లక్ష్మమ్మ. ఉయ్యాలవాడ మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామనివాసి. కరోనా మొదటి విడదత సమయంలో గ్రామంలో కరోనా ఎక్కువ మందికి సోకింది. వారంతా ఈమె ఉండే ఇంటికి సమీపంలో ఉండేవారు. తనకు కూడా సోకుతుందేమోనని నంద్యాలలోని బంధువుల ఇంటికి వెళ్లిపోయింది. ఆ సమయంలో జనం ఎవరూ బయటకు వచ్చేవారు కాదు. అయినప్పటికీ పథకాల అమలు కోసం వలంటీర్ వలంటీర్ మహమ్మద్ రఫీ తనకు కేటాయించిన 50 ఇళ్లకు ప్రాణాలకు తెగించి తిరిగేవాడు. కోవిడ్ సమయంలో ఫీవర్ సర్వే, కోవిడ్ సోకి ఇంటిలో ఉండి చికిత్స పొందుతున్న వారికి మందులు అందజేయడంలో కీలకంగా వ్యవహరించాడు. అలాగే ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారికి అక్కడి వెళ్లి పింఛన్ అందజేసేవాడు.

ఇంటికి వచ్చి భరోసా ఇచ్చారు



కరోనా మహమ్మారి మొదటి విడత వచ్చినప్పుడు మా ఇంటి పరిసరాల్లో కరోనా బాధితులు ఉండేవారు. గ్రామంలో జనం బయటకు రావడానికి జంకేవారు. ఆ సమయంలో కరోనా ఎటు నుంచి వస్తుందోనని భయాందోళనతో గ్రామం విడిచి నంద్యాలలోని బంధువుల ఇంటికి వెళ్లాను. ఈ సమయంలో పింఛన్ రావడంతో తాను బంధువుల వద్ద ఉన్నానని తెలుసుకుని మా వలంటీర్ మహమ్మద్ రఫీ అక్కడకు వచ్చి పింఛన్ సొమ్ము అందజేశారు. భయపడవద్దు అంటూ భరోసా కల్పించి వెళ్లాడు. ఇలా నేనున్ని రోజులు అక్కడికి వచ్చి పింఛన్ ఇచ్చాడు. దీంతో నాకు కొంత ఆర్థికంగా ఊరట కలిగింది. ఆయన సేవలను వెలకట్టలేం - ఆకుల లక్ష్మమ్మ, ఆర్.పాంపల్లె

ధైర్యంగా సేవలందించారు..


కరోనా సమయంలో వృద్ధుడికి రూ.వెయ్యి అందజేస్తున్న వలంటీర్ సుబ్రహ్మణ్యం (ఫైల్)

ఈ చిత్రంలో వృద్ధుడికి ప్రభుత్వం అందజేసిన రూ. వెయ్యి అందజేస్తున్న వలంటీర్ పేరు సుబ్రహ్మణ్యం. ఐటీఐ చదువుకొని ఉయ్యాలవాడ గ్రామంలో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈయనకు కేటాయించిన 60 కుటుంబాలకు నాలుగేళ్లుగా అని విధాలుగా సహాయకారిగా ఉంటున్నాడు. కరోనా సమయంలో ప్రభుత్వ సేవలు నిలిచిపోకుండా ప్రజలకు అందజేయడం, వివిధ సర్వేలు, కరోనా బాధితులను గుర్తించడంలో వైద్య సిబ్బందికి సహాయంగా ఉండటం, హోం క్వారంటైన్‌లో ఉన్న వారికి మందులు అందజేయడం, కోలుకున్న వారికి సూచనలు చేయడం, వారి ఆరోగ్య వివరాలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం ఆ సమయంలో ప్రజలకు అందజేసిన రూ.వెయ్యిని ఇంటింటికీ తిరిగి అందజేసి ప్రజల నుంచి మన్ననలు పొందాడు. - ఉయ్యాలవాడ

బంధువులా ఇంటికి వస్తున్నాడు



కరోనా పేరు వింటే ఇప్పటికి భయం వేస్తుంది. వ్యాధి సోకితే ఎవరూ బతుకుతారో లేదో చెప్పలేని పరిస్థితి. సొంత బంధువులు కూడా పలకరించేందుకు కూడా భయపడేవాళ్లు. ఆ సమయంలో మా వలంటీర్ సుబ్రహ్మణ్యం బంధువులా ఇంటికి వచ్చి నగదు అందజేయడంతో పాటు కావాల్సిన మందులు, అవసరమైన సరుకులు అందజేశాడు. ఏ కార్యాలయం వద్దకు వెళ్లకుండానే సేవలందిస్తున్నాడు. ఆయన సేవలను పొగడకుండా ఉండలేం.
- అంబటి సుంకన్న, ఉయ్యాలవాడ

రోజూ స్పందన నిర్వహించాలి

దొర్నిపాడు: మండలంలోని గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీఓ సుబ్బారెడ్డి శనివారం ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏదైనా అవసరం వచ్చినా, అర్హత ఉండి సంక్షేమ పథకం అందకపోయినా స్థానిక సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్, గ్రామ పంచాయతీ కార్యదర్శికి అర్జీలను అందజేసి రసీదులను పొందాలని సూచించారు.